www.navatelangana.com

# నవతెలంగాణ

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్

గురువారం 13 జులై 2023




## ఆరో తరగతిలో ప్రవేశాలు ప్రారంభం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

2023-24 విద్యాసంవత్సరంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో విద్యార్థుల ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. బుధవారం 21 మంది విద్యార్థుల ప్రవేశాలు పొందగా వారికి విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలు, జామెట్రీ బాక్స్‌లు, పెన్స్, పెన్సిళ్లు, కాస్మోటిక్స్, బెడ్, బెడ్ కవర్, టవల్, స్కూల్ బ్యాగ్స్ అందించారు. అర్హత పొందిన విద్యార్థుల ప్రవేశాలు మరో రెండు రోజుల పాటు కొనసాగనున్నట్లు ప్రిన్సిపాల్ వివరించారు.



## పోచమ్మను దర్శించుకున్న మేయర్ విజయలక్ష్మీ

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి మహా పోచమ్మ ఆలయాన్ని బుధవారం గ్రేటర్ హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మీ దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ అయిటి చందు మేయర్ దంపతులను శాలువాతో సత్కరించి అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పురుషోత్తంరావు, దేవాయి, సీనియర్ అసిస్టెంట్ రమణారావు, గ్రామ సర్పంచ్ సుచరిత రాజేశ్వర్‌రావు, ఆలయ సిబ్బంది ఉన్నారు.



## గులాబీ గూటికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అప్పాల గణేష్

నవతెలంగాణ-నిర్మల్

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ తిరిగి సొంతగూటికి చేరుకున్నాడు. బుధవారం దివ్య గార్డెన్‌లో రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. గులాబీ కండువా కప్పి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అప్పాల గణేష్, ఆయన అనుచరులను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. అంతకుముందు బైల్ బజార్ నుంచి దివ్య గార్డెన్ వరకు గణేష్, ఆయన అనుచరులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. గణేష్‌తో పాటు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, సైండ్ల శ్రీధర్, మాజీ కౌన్సిలర్లు చందుపట్ల రవి, తోట నర్సయ్య, గోపు గోపి, నేల అరుణ్ కుమార్, సాకీర్, అలీం, అప్పాల ప్రభాకర్ బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు యువకులు, కులసంఘాల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో దేశంలో ప్రగతిపథంలో అగ్రగామిగా నిలుస్తుందని అన్నారు. ఈ నేపథ్యంలోనే దేశ వ్యాప్తంగా బీఆర్ఎస్‌కు అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌తో పాటు ఇతర రాష్ట్రాల నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ అప్పాల గణేష్ లాంటి వారు సొంత పార్టీలోకి తిరిగి రావడం సంతోషంగా ఉందన్నారు. సమిష్టిగా పని చేసి నిర్మల్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ముథోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎర్రవోతు రాజేందర్, జిల్లా రైతు సమన్వయ సమితి చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్షులు మారుగొండ రాము పాల్గొన్నారు.

## 'యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును వ్యతిరేకిస్తున్నాం'

**ఆదిలాబాద్‌టౌన్ :** యూనిఫాం సివిల్ కోడ్ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) జిల్లా అధ్యక్షులు గేడం గణేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘం నాయకులతో కలిసి ముక్తకంఠంతో ఖండించారు. ఆదివాసీ గిరిజనులకు ప్రత్యేక హక్కులు, చట్టాలు ఉన్నాయన్నారు. సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రత్యేకత కలిగి ఉన్నాయన్నారు. ఎస్టీ రిజర్వేషన్ పేరు మీద గెలుపొందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు అసెంబ్లీలో, పార్లమెంట్‌లో తమ గళం వినిపించాలని, దీనిపై విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. ప్రజాస్వామిక వాదులు, మేధావులు, కర్షకులు, కార్మికులు, ఆదివాసులు, సార్‌మేడిలు, సర్పంచులు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ మనుగడకు పూర్తి వ్యతిరేకమైన ఈ యూసీసీ బిల్లును వ్యతిరేకించాలని అన్నారు. భారత రాజ్యాంగంలో పొందుపర్చిన చట్టాలకు తూట్లు పొడిచే ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**ఖానాపూర్‌రూరల్:** గోదావరి నది తీరంలో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గోదావరి తీరంలో ప్రత్యేక సిబ్బందిని నియమించి శుభ్రత పాటించాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం పట్టణంలోని పలు అభివృద్ధి పనులను పరిశీలించిన సందర్భంగా అధికారులతో మాట్లాడారు. గోదావరి తీరంలో నిర్మించిన శ్మశాన వాటికను పూర్తిస్థాయిలో పరిశీలించి అధికారులతో సమీక్షించారు. అక్కడ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గోదావరి తీరంలో ప్రత్యేక సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగే విధంగా బోర్డులు ఉండాలని అధికారులను ఆదేశించారు. అలాగే రానున్న వర్షాకాలం దృష్ట్యా లోతట్టు ప్రాంతాలను పరిశీలించి తగు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం కలెక్టర్‌తో స్థానిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేకంగా చర్చించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాజమౌళి, కమిషనర్ మనోహర్‌గౌడ్, మున్సిపల్ ఏఈ తిరుపతి ఉన్నారు.

## మంత్రిని కలిసిన గిరిజన సంఘం నాయకులు

**ఆదిలాబాద్‌టౌన్ :** తెలంగాణ గిరిజన శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ మిడియం బాబురావు, రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి గిరిజన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. దరఖాస్తు చేసిన పోడు సాగుదారులందరికి సర్వే చేసి హక్కు పత్రాలు వెంటనే జారీ చేయాలన్నారు. ఆదివాసుల భూమి, ఉపాధి, సంస్కృతి, పరిరక్షణ కోసం 1/70, పెసా చట్టాలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. గుర్తించిన ప్రతి ఆదివాసీ కుటుంబానికి అంత్యోదయ రేషన్ కార్డులు ఇవ్వాలని, ఆహార భద్రత కల్పించాలన్నారు. ప్రతి గిరిజన గూడెనికి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రతి జిల్లాకు ఒక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని, గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని, ఆదివాసులకు మాతృభాషలోనే ప్రాథమిక విద్య అందించాలని, ఏజెన్సీలోని అన్ని పాఠశాలలో శిక్షణ నిచ్చిన వాలంటీర్లను నియమించాలని కోరారు.

## నీటి సమస్య పరిష్కారానికి కృషి



నవతెలంగాణ-నార్నూర్

గ్రామాల్లో నీటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని దివ్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ దారావత్ ప్రవీణ్‌నాయక్ అన్నారు. బుధవారం గాదిగూడ మండలం అర్జుని గ్రామాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎదుర్కొంటున్న నీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రెండు రోజుల్లో బోరు వేసి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులు తుమ్రం ఈశ్వర్, ఆత్రం బలరాం, కుమ్ర జైవంత్ పటేల్, గెడం జ్యోతిరామ్, నైతం యశ్వంత్ పటేల్, మెస్రం చిన్ను, సలాం మధు, పూసం సురేష్ ఉన్నారు.

## ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ముట్టడించిన దివ్యాంగులు

**ఆదిలాబాద్‌టౌన్ :** తమకు ఇంటి స్థలాలు కేటాయించి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు చేపడుతున్న నిరవధిక దీక్షలు 154వ రోజుకు చేరుకున్నాయి. అందులో భాగంగా బుధవారం ర్యాలీగా తరలివెల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని, అర్హులైనవారికి పింఛన్లు మంజూరు చేయాలని శాంతియుతంగా నిరసన తెలియజేస్తుంటే అటు ప్రభుత్వంగానీ, అధికారయంత్రాంగంగానీ స్పందించకపోవడం బాధాకరమని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ఎండి. ఇమ్రాన్ న్నారు. స్థానిక ఎమ్మెల్యే సైతం అనేకమార్లు హామీలిచ్చి విస్మరించారని మండిపడ్డారు. ఇప్పటికైనా స్పందించి సమస్యలు పరిష్కరింకుంటే ప్రజాప్రతినిధుల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు.

కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ

# రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- పాల్గొన్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

వ్యవసాయానికి 3గంటలు కరెంట్ సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ శ్రేణులు, రైతులు భగ్గుమన్నారు. జిల్లా కేంద్రంలో కరెంట్ కార్యాలయం ముందు రహదారిపై బైటాయించి కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. రైతులకు మద్దతుగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులతో కలిసి రహదారిపై బైటాయించారు. రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం టీపీసీసీ చీఫ్ రేవంత్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిస్తే, కాంగ్రెస్ మాత్రం రైతుల పొట్టకొట్టేందుకు చూస్తోందని మండిపడ్డారు. ఉచిత విద్యుత్‌పై రేవంత్ చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. అనాడు టీడీపీ ప్రభుత్వంలో రైతు వ్యతిరేక విధానాలపై బషీర్‌బాగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై చంద్రబాబు నాయుడు కాల్పులు జరిపి ముగ్గురిని పొట్టనపెట్టుకున్నాడని గుర్తు చేశారు. ఇవాళ ఆయన శిష్యుడు రేవంత్‌రెడ్డి ఉచిత కరెంట్ వద్దంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశానికి అన్నం పెట్టే అన్నదాతలు అంటే కాంగ్రెస్‌కు మొదటి నుంచి కండ్ల మంటేనని మండిపడ్డారు. మొన్ననేమో ధరణి వద్దన్నారని, ఇప్పుడేమో ఉచిత కరెంట్ వద్దని కాంగ్రెస్ రైతు వ్యతిరేకి అని నిరూపించుకుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, రైతు సమన్వయ సమితి చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, పట్టణ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**నార్నూర్ :** రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు నిరసనకు దిగారు. మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను దహనం చేశారు. వైస్ ఎంపిపి చంద్రశేఖర్ జాదవ్, నాయకులు రాథోడ్ రామేశ్వర్, రమేష్ పాల్గొన్నారు.

**ఖానాపూర్ :** రైతులకు ఉచిత విద్యుత్ అవసరం లేదంటూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తెలంగాణతల్లి చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా శ్యామ్‌నాయక్ మాట్లాడుతూ రైతులకు విద్యుత్ ఇవ్వకుండా వేధించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. సీఎం కెసిఆర్ పాలనలో రైతులకు ఉచితంగా 24 గంటల కరెంట్ ఇస్తుంటే రైతుల విలువలు తెలియని రేవంత్‌రెడ్డి వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదన్నారు.

**తాంసి :** బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం తాంసి, భీంపూర్ మండల కేంద్రాల్లో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేసి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ అరుణ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత రైతులకు 24గంటల ఉచిత విద్యుత్ ఇవ్వడంతో రెండు మూడు పంటలు తీసుకుంటున్నారని తెలిపారు. రేవంత్‌రెడ్డి పంటలకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని అవగాహన లేని మాటలు మాట్లాడి రైతులను అవమానించారని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కోఆర్డినేటర్ గోవర్ధన్‌రెడ్డి, అనిల్, ఏసీసీఎస్ వైస్ చైర్మన్ ధనుంజయ్, నాయకులు శ్రీధర్‌రెడ్డి, క్రిష్ణ, వెంకన్న, గజానన్, పరమేశ్వర్, కాంతరెడ్డి, దేవిదాస్, అశోక్, రఘు, రమణ పాల్గొన్నారు.

**కడెం :** రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు అవసరం లేదంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణతల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జొన్నల చంద్రశేఖర్ గుప్తా ఆధ్వర్యంలో రహదారిపై బైటాయించారు. రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఆత్మ కమిటీ చైర్మన్ కానూరి సతీష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొండుకూర్ సర్పంచ్, గొల్ల వేణుగోపాల్, కడెం సర్పంచ్ కొండాపురం అనూష- లక్ష్మణ్, కొత్త మద్దిపడడ సర్పంచ్ జాడి రాజమణి- ఇందూర్, ఉడుంపూర్ గ్రామ సర్పంచ్ కుర్ర లక్ష్మీ- లక్ష్మణ్, నాయకులు ఎండి హసీబ్, బోర్లకుంట రాజేష్ పాల్గొన్నారు.







# రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారాన్ని సహించం

- టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు



నవతెలంగాణ-ఉట్నూర్

సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకునేది లేదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు హెచ్చరించారు. టీపీసీసీ పిలుపు మేరకు బుధవారం మండల కేంద్రంలోనీ విద్యుత్ కార్యాలయం ముందు కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతులకు మాయమాటలు చెప్పి మోసం చేశారని, ఉచిత కరెంట్, రుణమాఫీ, ఉచిత ఎరువులు, విత్తనాలు హామీ విస్మరించారని విమర్శించారు. గతంలో వైయస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఉచిత కరెంట్ సౌకర్యం, రుణమాఫీ చేసిన ఘన కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కొన్ని మీడియా ఛానెల్స్, సోషల్ మీడియా వేదికగా టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆయన సమక్షంలో చేరారు.

**ఆదిలాబాద్‌టౌన్ :** రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి కాంగ్రెస్‌పై బురద జల్లడాన్ని తీవ్రంగా ఖండిస్తూ బుధవారం ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకోవడంతో తోపులాటకు దారి తీసింది. స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ సందర్భంగా సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ 2004 కంటే ముందు రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ బకాయిలను రద్దుచేసి రైతులను ఆదుకున్నామని, 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసి రైతాంగానికి బాసటగా నిలిచామని అన్నారు. మళ్లీ వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, రైతులందరికీ నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని చెప్పారు. టిపిసిసి ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరు సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల పొలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయి నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించలేని స్థితిలో ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. అలాంటిది తమ నాయకుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను వక్రీకరించి బద్నాం చేయాలని చూడడం, బురదజల్లే ప్రయత్నం చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు గుడిపల్లి నగేష్ , జిల్లా కాంగ్రెస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భూపెల్లి శ్రీధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాడే సంతోష్, కలీం, ఎస్టీ సెల్ చైర్మన్ ఆనంద్‌రావ్, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు అర్షత్‌ఖాన్, అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, మహిళా నాయకురాలు తొడసం లక్ష్మి, మాజీ ఎంపీటీసీ చాకటి లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

**సారంగాపూర్ :** రైతు పక్షపాతి కాంగ్రెస్ పార్టీ అని నిర్మల్ నియోజక నాయకులు రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని స్వర్ణ గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద సీఎం కేసిఆర్ దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బిఆర్ఎస్ అధికారం కోల్పోతామని భయంతోనే టిపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మొదటగా గిరిజనులకు పోడు భూములకు పట్టాలు, రైతులకు ఉచిత విద్యుత్ ప్రారంభించిన విషయం బిఆర్ఎస్ నాయకులకు గుర్తుండాలని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు ఎంబడి రాజేశ్వర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశత రాజేశ్వర్, నాయకులు బాలాజీ నర్సయ్య, హధి, సలీం, భీంరావు పాల్గొన్నారు.

**ఖానాపూర్‌టౌన్ :** టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరిండాన్ని నిరసిస్తూ బుధవారం కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు దొనికెని దయానంద్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన కరెంట్ ఇవ్వకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులను మోసం చేస్తున్నారన్నారు. 24 గంటలు కరెంట్ ఇస్తున్నట్లు మోసపూరిత ప్రచారంతో పబ్బం గడుపుతున్నాడని ఆరోపించాడు. రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు. రైతు శ్రేయస్సు కోరే ప్రభుత్వంగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకున్న పార్టీ తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చిన్నం సత్యం, కిషోర్ నాయక్, షబ్బీర్ పాషా, నిమ్మల రమేష్, తోట సత్యం, మడిగెల గంగాధర్, సలీంఖాన్, జహీర్, సందీప్, రవి, రాజన్న పాల్గొన్నారు.







వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో

## పాఠశాలల బంద్ విజయవంతం




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి జిల్లా వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైందని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలను, జూనియర్ కళాశాలలను నాయకులు బంద్ చేయించారు. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యాల పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్యను గాలికి వదిలేసిందని, పిల్లలు తక్కువ ఉన్నారన్న నెపంతో కొన్ని వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తూ, ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, జతల యూనిఫామ్స్ అందించాలని అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, మౌళిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్, జిల్లా నాయకుడు షేక్ సోజర్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గేడం కేశవ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మడావి గణేష్, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి అజ్మీరా వినోద్ కుమార్, ఏఐఎఫ్డీఎస్ జిల్లా కార్యదర్శి కుంటాల నవీన్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం భాస్కర్, ఏఐఎస్బి రాష్ట్ర కార్యదర్శి జవరే రాహుల్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు మెస్రం జలీంషావ్, పంద్రా లక్ష్మణ్, ఏఐఎఫ్డీఎస్ జిల్లా నాయకులు కాంబ్లే సుబోద్, విశ్వ పాల్గొన్నారు.




**నిర్మల్ :** విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యాసంస్థల బంద్ బుధవారం విజయవంతమైంది. ఈ సందర్భంగా వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని అన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్యను గాలికి వదిలేసిందన్నారు. పిల్లలు తక్కువ ఉన్నారన్న నెపంతో కొన్ని వేల ప్రభుత్వ పాఠశాలలను మూసేసి ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు విచ్చలవిడిగా అనుమతులిస్తూ, ప్రభుత్వ విద్యా రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్య పుస్తకాలు, 2 జతల యూనిఫామ్స్ అందించాలన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేసి, మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. మన ఊరు-మన బడి/బస్తీ పథకాన్ని అన్ని స్కూళ్లకు వర్తింపజేయాలన్నారు. పెండింగ్ స్కాలర్‌షిప్స్ తక్షణమే విడుదల చేయాలని, కార్పొరేట్, ప్రైవేటు విద్యా సంస్థలలో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించి, ఫీజు నియంత్రణ చట్టం చేయాలని, ప్రభుత్వ పాఠశాలల మూసివేతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వామపక్ష విద్యార్థి సంఘం నాయకులు శీతల్కరి అరవింద్, నవీన్, కైలాస్, అంబాదాస్, రాజు, సింగారి వెంకటేష్, దిగంబర్ పాల్గొన్నారు.

## తెరపైకి భరంపూర్ మండలం

- ఎమ్మెల్యేకు 12పంచాయతీ ప్రజల వినతి



నవతెలంగాణ- తలమడుగు

తలమడుగు మండలం భరంపూర్ గ్రామ కేంద్రంగా కొత్త మండలం తెరమీదికొచ్చింది. ప్రభుత్వం ఇటీవల సొనాలను మండల కేంద్రంగా ఏర్పాటుచేయడంతో దూరభారం దృష్ట్యా భరంపూర్‌ను కూడా ఇదే విధంగా మండలం ఏర్పాటుచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బుధవారం బరంపూర్ సమీప గ్రామ పంచాయతీ ప్రజలు బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావుకు వినతిపత్రం అందించారు. ప్రస్తుత మండల కేంద్రానికి వెళ్లాలంటే దూరభారం అవుతుందని.. భరంపూర్ గ్రామం కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటుచేస్తే కజ్జర్ల, లచ్చంపూర్, పల్లి(కె), దేవాపూర్, పల్లి(బి), నందిగాం, అర్లి(కె), సకినాపూర్, చర్లపల్లి పంచాయతీల పరిధిలో 21 అనుబంధ గ్రామాలున్నాయని తెలిపారు. వీటి పరిధిలో 18వేల జనాభా ఉందని వివరించారు. ప్రస్తుతం భరంపూర్ మీదుగా నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండల కేంద్రానికి రహదారి సౌకర్యం కూడా ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. మారుమూల గ్రామాలు అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉన్నాయని ఎలాంటి సదుపాయాలు లేవని పేర్కొన్నారు. బరంపూర్ మండల కేంద్రం అయినట్లయితే బోథ్ నియోజకవర్గ కేంద్రం దూరభారం తగ్గుతుందన్నారు. ప్రభుత్వ పాలన మరింత సులభతరం అవుతుందని..ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని బరంపూర్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. వారి వినతికి ఎమ్మెల్యే బాపురావు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో మాజీ జడ్పీటీసీ బొల్లారపు బాబన్న, సర్పంచ్ రమేష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్‌కుమార్, సత్యనారాయణ, శాస్త్రి, అశోక్‌రెడ్డి, గంగయ్య, వివిధ గ్రామాల ప్రజలు ఉన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో టీబీ పరీక్షలు

నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం టీబీ, తెమడ పరీక్షలు నిర్వహించినట్లు హెల్త్ సూపర్‌వైజర్ పరశురామ్ పేర్కొన్నారు. వైద్య శిబిరంలో మండలంలోని 53 గ్రామాల నుండి 25 మంది లక్షణాలు ఉన్న వారిని గుర్తించి ఆసుపత్రిలో క్యాంపు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో వైద్య సిబ్బంది రవీందర్, మీరజ, ఆశా కార్యకర్తలు అరుణ, సుగుణ, బాపురావ్ పాల్గొన్నారు.

## వాహనాల తనిఖీ

నవతెలంగాణ-లక్ష్మణచాంద



మండలంలోని కనకపూర్ గ్రామ శివారులో నిర్మల్ వెళ్లే మార్గంలో ఏఎస్ఐ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వాహన ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలన్నారు. రోడ్డు భద్రత ప్రమాణాలు పాటించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల తనిఖీ నిర్వహించి తగు జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ వహీద్, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

## బీసీ సంఘ భవనానికి రూ.5లక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘ భవనానికి మున్సిపాలిటీ ద్వారా రూ.5లక్షల నిధులను కేటాయించడం పట్ల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్‌ను సంఘం అధ్యక్షులు చిక్కాల దత్తు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి నిధుల కేటాయింపుకు సంబంధించిన పత్రాలను చైర్మన్ అందించారు. భవన నిర్మాణానికి మున్సిపల్ సహకారం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే జోగురామన్నతో పాటు చైర్మన్‌కు ధన్యవాదాలు తెలిపారు.

# పారిశుధ్య కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ ఎదుట చేపట్టి ధర్నాకు బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ మద్దతు తెలిపి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమాయక పారిశుధ్య కార్మికులకు కూడా జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉందన్నారు. ఎమ్మెల్యేలకు క్రమం తప్పకుండా లక్షల్లో జీతాలు ఖాతాల్లో పడుతున్నాయి కానీ బతకడానికి మాత్రమే పని చేస్తున్న నిరుపేద కార్మికులకు కనీస అవసరాలకు కూడా జీతాలు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. ధర్నాలో బీజేపీ నాయకులు చిలుకూరి జ్యోతిరెడ్డి, ముకుందరావు, భూమారెడ్డి, సాయి, శివ పాల్గొన్నారు.

**తలమడుగు :** పంచాయతీ పారిశుద్ధ కార్మికుల సమ్మె బుధవారం ఏడవ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆశన్న మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాలీచాలని వేతనాలతో పంచాయతీ కార్మికులు వెట్టి చాకిరి చేస్తున్నప్పటికీ పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. సమ్మెలో వివిధ గ్రామ పంచాయతీల పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

**బాసర :** పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరసన బుధవారం రెండవ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని పంచాయతీ కార్మిక సంఘం అధ్యక్షుడు దేవ్‌రావు అన్నారు. బిజెపి నాయకులు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, పట్టణ అధ్యక్షుడు జిడ్డు సుభాష్, సరస్వతి ఆలయ వాగ్దేవి సొసైటీ సభ్యులు సంఘీభావం తెలిపారు.

**బేల :** పంచాయతీ కార్మికుల సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసిని రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మెకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు చేస్తున్న కార్మికులను చిన్నచూపు చూడడం తగదన్నారు. ఆమె వెంట మండల అధ్యక్షులు దత్త నిక్కం, ఎంపిటిసి జ్యోతి, నాయకులు తాటి సతీష్, కాంత, అశాంత్, సతీష్‌రెడ్డి, పవన్, ఆశిష్‌రెడ్డి ఉన్నారు.

**తాంసి :** పారిశుధ్య కార్మికులు వారం రోజులుగా తమ న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికుల సంఘం మండల అధ్యక్షులు మాట్లాడుతూ గ్రామంలో చెత్తాచెదారాన్ని, మురికి కాల్వలను శుభ్రం చేసి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తున్నామన్నారు. న్యాయమైన డిమాండ్‌ల కోసం వారం రోజులుగా సమ్మె చేస్తున్నా సీఎం కేసీఆర్ పట్టించుకోకపోవడం బాధాకరమని తెలిపారు. కార్యక్రమంలో విలాస్, గంగన్న, రాజు, స్వామి, పొచ్చన్న, రాములు పాల్గొన్నారు.



## ఉపాధి పనుల రికార్డులు సరిగా ఉండాలి

నవతెలంగాణ - తాంసి

జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి వివరాలు రికార్డుల్లో క్లుప్తంగా ఉండేటట్లు చూసుకోవాలని ఉపాధి హామీ రాష్ట్ర పర్యవేక్షకులు మల్లప్ప సిబ్బందికి, పంచాయతీ కార్యదర్శికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఉపాధి హామీలో నాటిన ఈత మొక్కలను, పశువుల తొట్టెలను, మామిడి, జామ మొక్కలను పరిశీలించి పనులకు సంబంధించి జాబ్ కార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీలో హరితహారం, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు నిర్మించడం జరిగిందన్నారు. ఈ పనులను పరిశీలిస్తున్నామని తెలిపారు. జామ, మామిడి, ఈత మొక్కలు పొలంలో పెట్టుకోవడం వల్ల ఆదాయం వస్తుందన్నారు. గీత కార్మికులు ఈత చెట్ల పెంపకంతో ఉపాధి పొందవచ్చని పేర్కొన్నారు. ఆయన వెంట సర్పంచ్ స్వప్న రత్నప్రకాష్, ఏపీడీ సిద్దిక్, ఏపీఓ విజయ, కార్యదర్శి గంగన్న, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల ఆందోళన

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

ఐదు ప్రధానమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ భవన నిర్మాణ కార్మికులు పనులు బంద్ చేసి బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. భవన నిర్మాణ కార్మిక సంఘ భవనం నుండి భారీ ర్యాలీగా తరలివచ్చి కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు పోశన్న ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించని పక్షంలో దశలవారీగా ఆందోళనలు చేపడతామని వెల్లడించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధానంగా ఇండ్లు లేని పేద కార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేసి ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సొంత స్థలాలు ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థికసాయం అందించాలన్నారు. 55 ఏళ్లు దాటినవారికి ఐదు వేల పింఛన్ ఇవ్వాలన్నారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు మంజూరు చేయాలన్నారు. 15 రోజుల్లో ఈ సమస్యలు పరిష్కరించాలని, న్యాయబద్ధమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. లేనిపక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

**కార్మికులకు బీజేపీ మద్దతు**

భవన నిర్మాణ కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షులు పాయల్ శంకర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట వారి సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడుతూ 9 సంవత్సరాలలో రాష్ట్రప్రభుత్వం కార్మికుల కోసం చేసింది ఏమీ లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే జోగు రామన్న తన కోసం పెద్ద బంగాళాలు కట్టుకున్నాడు కానీ ఆ బంగాళాలు కట్టిన కార్మికులకు జానెడు ప్రభుత్వ భూమి ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ భూములను బిఆర్ఎస్ నాయకులు కబ్జాలు చేశారని ఆరోపించారు. భవన నిర్మాణ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

మండలంలోని రాచపూర్ గ్రామానికి చెందిన జడ రాజేశ్వర్(53) బుధవారం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ దుర్మరణం చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం..రాజేశ్వర్ వ్యవసాయ పనులకు వెళ్తుండగా మండల కేంద్రానికి చెందిన వాహనం బలంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# పండ్లతోటల సాగుపై దృష్టి సారించాలి



నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన రైతులు పండ్ల తోటలను సాగు చేసి, ఆర్థికంగా లబ్ది పొందాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. బుధవారం మండలంలోని జీయర్‌నగర్, కొత్తగూడ గ్రామాల్లో సీపీఎఫ్ ఎన్జీవో ఆధ్వర్యంలో సాగు చేస్తున్న మామిడి తోటలను పీఓ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంటల సాగు వివరాలను, ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. గిరిజన రైతులు పండ్లతోటలతో పాటు అంతర పంటలైన పెసర, కంది, మునగ, మినుము, ఇతర పప్పు దినుసు పంటలను సాగు చేస్తే అధిక ఆదాయాన్ని పొందేందుకు వీలు పడుతుందన్నారు. రైతులకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సీపీఎఫ్ సహకారంతో కొత్తగూడ గ్రామంలో రైతు ఉత్పత్తి సంఘం ఆధ్వర్యంలో నడుస్తున్న వానపాముల ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించి, నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. పీఓ వెంట సర్పంచ్ ఆత్రం రాహుల్, హర్టికల్చర్ అధికారి సందీప్కుమార్, హెచ్ ఓ సుధీర్ కుమార్, సీపీఎఫ్ సంస్థ సభ్యులు, రైతులు ఉన్నారు.

## రైతుబీమాకు కొత్త పట్టాదారులు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

కొత్తగా పట్టాదారుపాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతు బీమా పథకంలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి భాస్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు రైతు మరణించినట్లయితే రాష్ట్ర ప్రభుత్వం కుటుంబానికి రూ.5లక్షలు సాయం చేసి ఆదుకుంటుందన్నారు. 18 నుండి 59 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర నమోదు చేసుకోవాలన్నారు. ఇంతకుముందు రైతు బీమా పథకంలో నమోదు చేసుకున్న రైతులు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆగస్టు 5లోపు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని, ఏమైనా మార్పులు చేసుకునేవారు ఈ నెల 30లోపు చేసుకోవాలని పేర్కొన్నారు.

## మంత్రి దృష్టికి మామిడిగూడ రోడ్డు ప్రతిపాదన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని హార్క్యాపూర్ పంచాయతీ పరిధిలోని మామిడిగూడ ఆదివాసీ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని సర్పంచ్ కుడే కైలాస్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో రాష్ట్ర గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

## పోడు పట్టాలు వెంటనే అందించాలి

నవతెలంగాణ-బేల

ఏళ్లుగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు వెంటనే అందజేయాలని బీజేపీ నాయకురాలు సుహాసినిరెడ్డి కోరారు. మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బాది గ్రామానికి చెందిన రైతులతో కలిసి ధర్నా చేపట్టి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఎన్నికలకు ముందు పోడు భూములకు 24గంటల్లో పట్టాలు ఇస్తామని, అలాగే రైతుబంధు ఇస్తామని ఎమ్మెల్యే జోగు రామన్న హామీ ఇచ్చి మర్చిపోయారని పేర్కొన్నారు. వెంటనే బాది గ్రామానికి చెందిన రైతులకు గతంలో ఇచ్చిన హామీ మేరకు వెంటనే పట్టాలు అందించాలని, లేని పక్షంలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దత్త నిక్కం, ఎంపిటీసి ఒళ్లఫ్ వార్ జ్యోతి, వడ్డే పోశెట్టి పాల్గొన్నారు.

## ఆదిలాబాద్‌లో యువ పోరుయాత్ర విజయవంతం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

యువకులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి నేతృత్వంలో చేపట్టిన యువ పోరుయాత్ర ఆదిలాబాద్ నియోజకవర్గంలో జయప్రదమైందని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చరణ్‌గౌడ్ అన్నారు. ఇందుకు సహకరించిన వారందరికీ ప్రత్యేక కతజ్ఞతలు తెలియజేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 9 సంవత్సరాల కాలంలో ఎలాంటి నోటిఫికేషన్లు వేయకుండా విద్యార్థులను, నిరుద్యోగ యువతను మాయచేసి మభ్యపెడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం వైఖరిని ఎండగట్టేందుకే తమ నాయకుడు శివసేనారెడ్డి పోరు యాత్ర చేపట్టారని అన్నారు. ప్రతి నియోజకవర్గాన్ని సందర్శించి అక్కడి యువతను మేల్కొలిపే ప్రయత్నం చేస్తున్నారన్నారు. జిల్లాలో జరిగిన పోరు యాత్రకు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదంచేసినవారికి అలాగే అన్నివిధాలుగా సహాయ సహకారాలు అందించిన కాంగ్రెస్ జిల్లా నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## జాన్సన్ నాయక్ పర్యటన

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని ఏమాయికుంట, పాటగూడ, బిక్కుతండా, ముత్నూర్, ధర్మాసాగర్ తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలు ఆయనకు అడుగున నీరాజనాలు పలికారు. గ్రామాల్లో కాలినడకన వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. బిక్కుతండాలో తుకారాం నాయక్ దినదశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ముత్నూర్‌లో గ్రామ ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కుమ్రం భీమ్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం సవారి బంగ్లాలో గ్రామస్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సవారి బంగ్లా నిర్మాణానికి తనవంతు సహాయం సహకారం అందిస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎన్నికలో జాన్సన్ నాయక్‌కే మద్దతు ఉంటుందని తెలిపారు. ఆయన వెంట సర్పంచ్ జాదవ్ లఖన్, బిఆర్ఎస్ నాయకులు నవాబ్, కో ఆప్షన్ సభ్యులు జిలానీ, ఎండీ.మసూద్, వైస్ ఎంపీపీ పద్వాల్ గోపాల్ సింగ్, ఎంపీటీసీ మాధవి భీమ్‌రావ్, మాజీ ఎంపీటీసీ విజయ్ కుమార్, మాజీ ఎంపీపీ ఉన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-నిర్మల్



మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తున్నా స్పందించడం లేదని విమర్శించారు. మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం బంద్ చేసి నిరసన తెలియజేస్తున్నామన్నారు. జులై 13వరకు ప్రభుత్వం స్పందించకపోతే జులై 14 తర్వాత సమ్మెలోకి వెళ్తున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తుంచారు. మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాధ మాట్లాడుతూ విద్యార్థులకు అందించే భోజనాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. పెంచిన గౌరవ వేతనాన్ని నెలలు గడిచినా ప్రభుత్వం ఇప్పటిదాకా చెల్లించలేదన్నారు. జీవో 8 ప్రకారం పెరిగిన వేతనాలను ఎరియర్స్‌తో సహా వెంటనే చెల్లించాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. ప్రతి కార్మికురాలికి ఐడి కార్డు, యూనిఫాం, వంట సామాగ్రి ఇవ్వాలన్నారు. కోడిగుడ్లు ఉచితంగా, గ్యాస్‌ను సబ్సిడీ ద్వారా అందించాలన్నారు. అనంతరం డీఆర్‌ఓ లోకేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శి సత్తవ్వ, రాజవ్వ, శంకరమ్మ, పద్మ, రవీంద్ర, ఎంకవ్వ, బుచ్చవ్వ, స్వరూప పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి




నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ నాయకులు నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ హెచ్చరించారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనారెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎన్ని ఉద్యోగాలు వచ్చాయో ఆర్టీఏ ద్వారా తెలుసుకోవాలని హితవు పలికారు. నిరుద్యోగ యువతను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. 60 ఏళ్లపాటు అధికారంలో ఉండి ఎంతమందికి ఉద్యోగాలు కల్పించారని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు తెలంగాణ ఉద్యమ సమయంలో ఆంధ్ర పాలకులతో కలిసి ఎంతో మంది విద్యార్థుల ప్రాణాలను బలిగొన్నారని మండిపడ్డారు. కేజీ టు పీజీ విద్యలో భాగంగా విద్యారంగంలో అనేక సంస్కరణలు తీసుకొస్తున్నట్టు గుర్తు చేశారు. వేలాదిగా ప్రభుత్వ ఉద్యోగాలను కల్పించడంతో పాటు ప్రైవేటు రంగంలోనూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు మోసిన్, ప్రశాంత్, సాయి పాల్గొన్నారు.

## తుకారాం సేవలు మరువలేనివి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



తుకారాం సేవలు మరువలేనివని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం తుకారాం నాయక్ దిన దశ కార్యక్రమానికి హాజరయ్యారు. చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. గ్రామంతో పాటు సమాజానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు.

## వార్డు సభ్యున్ని పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-జైనథ్

మండల కేంద్ర పంచాయతీకి చెందిన 12వ వార్డు సభ్యులు దానిపెల్లి శ్రీకాంత్ పుట్టినరోజు వేడుకలు బుధవారం కార్యకర్తలు, ప్రజల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు నోటు పుస్తకాలను, బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా శ్రేయస్సు కోసం ఎల్లవేళల కృషి చేస్తానని అన్నారు.

## నేడు చలో హైదరాబాద్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13న నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్‌కు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులందరూ తరలిరావాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటాల రాములు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఐదారు రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వంగానీ, అధికారయంత్రాంగం గానీ స్పందించకుండా నిమ్మకునీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్నారు. అందుకే చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు తెలిపారు. ముఖ్యంగా 20 సంవత్సరాలుగా బడి పిల్లలకు వండిపెడుతున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. జీఓ 8 ప్రకారం పెంచిన వేతనం మూడు వేలు అమలు చేయాలని అన్నారు. పెండింగ్ బిల్లులు, జీతాలు విడుదల చేయాలని, కోడిగుడ్లకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. వంట గ్యాస్ సిలిండర్‌ను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని పేర్కొన్నారు. ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలను వర్తింపజేయాలన్నారు. ఈ సమస్యలన్నింటినీ వెంటనే పరిష్కరించాలన్నారు.

# రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-ఉట్నూర్

పంటల సాగుకు 3గంటలే కరెంట్ అవసరమని కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం అంబేద్కర్ చౌరస్తా వద్ద మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎక్స్‌రోడ్డు ప్రాంతంలోనూ బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు బాగుపడాలని 24 గంటల ఉచిత కరెంట్ సౌకర్యం కల్పిస్తుంటే రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం విడ్డురంగా ఉందన్నారు. గతంలో విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్‌దే అన్నారు. కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ శ్రీరాం నాయక్, నాయకులు పాల్గొన్నారు.

**బేల :** రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు నిరసిస్తూ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతర్రాష్ట్ర రహదారిపై బైటాయించి కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల అధ్యక్షులు జక్కుల మధుకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కళ్లెం ప్రమోద్‌రెడ్డి, దేవన్న, గంభీర్ ఠాక్రె, సతీష్ పవార్, మంగేష్ ఠాక్రె, తన్వీర్ ఖాన్, సంతోష్ పటేల్, సునీల్ గోడం, విపిన్ భోజే పాల్గొన్నారు.

**తలమడుగు :** రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ రైతువేదిక భవనం వద్ద ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు సమక్షంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బాపురావు మాట్లాడుతూ ఎందరో మంది ప్రాణ త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో రైతులకు 24 గంటలు ఉచిత విద్యుత్తు అందజేస్తే రేవంత్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఉచిత విద్యుత్, రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి కిరణ్‌కుమార్, రైతుబంధు నాయకుడు గోక జీవన్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాటిపల్లి శ్రీనివాసరెడ్డి, సునీతరెడ్డి, మగ్గిడి ప్రకాష్, లక్ష్మణ్, సర్పంచ్ ఆనంద్, రావుల నారాయణ, రామ్‌కిషన్, దేవన్న, మాధవరావు, మహేష్ పాల్గొన్నారు.

**ఆదిలాబాద్ రూరల్ :** మావల మండల కేంద్రంలోని రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నిరసన చేపట్టి దిష్టిబొమ్మ దహనం చేరుశారు. బీఆర్ఎస్ నాయకులు నల్ల రాజేశ్వర్ ఆధ్వర్యంలో ర్యాలీగా వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు చందాల రాజన్న, దర్శనాల ఏవన్, దొగ్గలి రాజేశ్వర్ పాల్గొన్నారు.

**బాసర :** బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. రైతులకు ఉచిత విద్యుత్తు సరఫరా మూడు గంటలే అవసరమని వ్యాఖ్యానించడం పై నాయకులు మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణరావు, పిఏసిఎస్ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, బిఆర్ఎస్ కన్వీనర్ కార్వా శ్యామ్, కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ అలీ, మాజీ పిఏసిఎస్ చైర్మన్ రామారావు, మల్లన్న యాదవ్, జ్ఞాని పటేల్, భూమన్న, బాబు, కృష్ణ పాల్గొన్నారు.

**నేరడిగొండ :** అంబేద్కర్ కూడలి వద్ద బీఆర్ఎస్ అధ్యక్షులు అల్లూరి శివారెడ్డి ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసి జహీర్, సర్పంచ్ రమణ, వైస్ ఎంపీపీ ఏలేటి మహేందర్‌రెడ్డి, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ముధోల్ :** రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ ముధోల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రైతు అభివృద్ధే లక్ష్యంగా 24గంటలు ఉచిత కరెంట్ అందజేస్తే కాంగ్రెస్ నాయకులు రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ చాలు అని మాట్లాడటం సిగ్గు చేటని అన్నారు. కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు రాంరెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఖాలిద్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండలంలోని చెడ్వాయి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం(2)ను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హసీనా బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భిణులకు, బాలింతలకు వర్షాకాలంలో ప్రబలే వ్యాధుల గురించి చెప్పి తగిన జాగ్రత్తలను సూచించారు. ఎలుకపెల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా వారికి చేతులను శుభ్రపరచే విధానాన్ని తెలియజేశారు. ఆరోగ్యకేంద్రం సిబ్బంది వ్యాసరచన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్రీలత, రహీమున్నీస, ఏఎన్ఎంలు భాగ్యలక్ష్మి, సావిత్రి, గర్భిణీలు పాల్గొన్నారు.



## దేవాపూర్‌లో ఫెర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని దేవాపూర్‌లోని ఫెర్టిలైజర్స్ దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ అధికారి వందన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అమ్మకాలు, కొనుగోలు, నిల్వ రిజిస్టర్లను పరిశీలించి తగు సూచనలను చేశారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని, అమ్మకం, కొనుగోలుకు సంబంధించి రశీదులు ఇవ్వాలి అని పేర్కొన్నారు.

## పని దినాలు పెరిగేలా చూడాలి

నవతెలంగాణ-హాజీపూర్

ఉపాధి కూలీలకు పని దినాలు పెరిగేలా చూడాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి శేషాద్రి ఆదేశించారు. బుధవారం మండలంలోని ముల్కల్ల రైతు వేదికలో జిల్లా వ్యాప్తంగా ఉన్నా టీఏ, ఈసీ, ఏపీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీఓ శేషాద్రి మాట్లాడుతూ కూలీలు పనిదినాలు సరితూగేల చూడాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీకి 5చొప్పున ఇంకుడు గుంతలు నిర్మించేల చర్యలు తీసుకోవాలన్నారు. టార్గెట్ ప్రకారం హరితహారం మొక్కలు నాటాలన్నారు. జీపీలో వంద పనిదినాలు పూర్తయిన 5 గురిని గుర్తించి వారికి స్వయం ఉపాధి నిమిత్తం ఉన్నతి స్కీమ్‌లో ట్రైనింగ్ ఇపించేలా చూడాలని ఆదేశించారు.

## స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



నవతెలంగాణ-కాసిపేట

మందమర్రి ఏరియాలోని కేకే2 ఉపరితల గనిలో భూములు కోల్పోయిన వారితో పాటు స్థానిక నిరుద్యోగ యువతకు ఉపరిత గనిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పెద్దనపల్లి పంచాయతీ సర్పంచ్ వేముల కృష్ణ నూతన జీఎం మోహన్‌రెడ్డిని బుధవారం కలిసి విన్నవించారు. మందమర్రి ఏరియా నూతన జీఎంగా బాధ్యత స్వీకరించిన మోహన్ రెడ్డిని సర్పంచ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఉపరితల గని వాళ్ల ఏర్పడే పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు.

## రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-హాజీపూర్

రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రజిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతు భీమా పతకం 2023వ సంవత్సరంకి సంబంధించి జూన్ 18 లోగా పట్టపాస్ బుక్ వచ్చిన రైతులు, ఇంత వరకు రైతు భీమా చేయించుకోని రైతులు వయసు 18 నుండి 59 సంవత్సరాల లోపు రైతులు రైతు భీమాకు ధరకాస్తు చేసుకోగలని తెలిపారు . దీనికి పట్టాపాస్ బుక్ జీరాక్స్, ఆధార్ కార్డ్ జిరాక్స్, నామినీ ఆధార్ కార్డ్ జిరాక్స్, రైతు బీమా అప్లికేషన్ ఫామ్‌కి జత చేసి సంబంధిత రైతు గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి ఆగస్ట్ 5 లోపు ఇవ్వాలని సూచించారు.

## రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని చెడ్వాయి క్లస్టర్‌లో కొత్తగా పట్టా పాస్ పుస్తకం వచ్చిన రైతుల నుండి రైతుబీమా కోసం దర్‌ఖాస్తులను స్వీకరిస్తున్నట్టు ఏఈఓ గౌసియాబేగం తెలిపారు. రైతుబీమా దరఖాస్తు చేసుకొనే రైతులు పట్టా పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు జిరాక్స్ ప్రతులను తీసుకురావాలని ఆమె కోరారు.

## ఎంఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ నియామకం



నవతెలంగాణ-నస్పూర్

మాదిగ హక్కుల దండోరా అనుబంధ సంఘమైన మాదిగ స్టూడెంట్ పోరం (ఎంఎస్ఎఫ్) మంచిర్యాల జిల్లా కన్వీనర్‌గా వడ్లకొండ సంజయ్ మాదిగని నియమించినట్లు మాది హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ మాదిగ తెలిపారు. బుధవారం శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎంహెచ్‌డీ, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశానుసారం నియామక పత్రాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో మాదిగ విద్యార్థి ఉద్యమాన్ని బలంగా నిర్మించాలని, విద్యార్థి సమస్యల పరిష్కారానికి పోరాడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా మాదిగ రిజర్వేషన్లు కల్పించాలని సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షులు కడారి రమేష్ మాదిగ, పట్టణ అధ్యక్షుడు అక్కపురం సమ్మయ్య మాదిగ, ఎంఎస్ఎఫ్ జిల్లా ఇన్‌ఛార్జి కొండ్ర ఉదయ్ మాదిగ పాల్గొన్నారు.

## కారుణ్య నియామక పత్రాలు అందజేత



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లు 15మందికి ఏరియా జనరల్ మేనేజర్ జి మోహన్ రెడ్డి కారుణ్య నియామక పత్రాలు అందజేసారు. ఈ సందర్భంగా జీఎం మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఏరియాలో ఇప్పటివరకు కారుణ్య నియామకాల ద్వారా 1594 మందికి ఉద్యోగాలు ఇచ్చామని, ఇతర సంస్థలతో పోలిస్తే సింగరేణిలో పని స్థలాలు, సమయాలు కాస్త భిన్నంగా ఉంటాయని విధులకు గైర్హాజరయితే ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం సెక్రెటరీ ఫైడిశ్వర్, టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మేడిపల్లి సంపత్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రెటరీ ఎస్ సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్ శ్యాంసుందర్, డిప్యై పీఎం సత్య బోస్, ఓఎస్ రాజలింగు, యూనియన్ లీడర్లు పాల్గొన్నారు.

# విద్యాసంస్థల బంద్ విజయవంతం



నవతెలంగాణ-హాజీపూర్

విద్యారంగ సమస్యల పరిష్కారానికి వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం తలపెట్టిన విద్యాసంస్థల బంద్ విజయవంతం అయింది. వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ విద్య సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను బైకాట్ చేయించి నిరసనలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అంతేకాకుండా విద్యార్థులకు రావలసిన యూనిఫామ్స్, బుక్స్ తక్షణమే విద్యార్థులకు అందించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్ తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజనం మెస్ చార్జీలు పెంచుతు, ప్రభుత్వ కళాశాలలో మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలను రద్దు చేసి, ఖాళీగా ఉన్న టీచర్, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్లు నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల సన్నీగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు సిద్ధార్థ, సికిందర్, సుమంత్, అనిల్ పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్ :** విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ పిలుపు మేరకు మండలవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ విజయవంతమైనట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఇస్తారి చిరంజీవి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, కేజీ టు పీజీ ఉచిత విద్యను గాలికొదిలేశారని, రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల దందా కొనసాగుతున్నప్పటికీ వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు ప్రవీన్, తిరుపతి, సాయికిరణ్ పాల్గొన్నారు.

**జన్నారం :** వామపక్ష విద్యార్థి సంఘాల పిలుపుమేరకు మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలు, కళాశాలలు, ప్రయివేట్ పాఠశాలల బందు విజయవంతం అయిందని ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు మనీష్ తెలిపారు. తరగతులను బహిష్కరించి బంద్ నిర్వహించినట్టు ఆయన పేర్కొన్నారు.

**దహెగాం :** రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బందు బుధవారం మండలంలో విజయవంతమైందని ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు తెలిగె హరీష్ అన్నారు. పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సందీప్, రజినీకాంత్, సంజీవ్, సంతోష్, సాయి, అంజన్న, రాజన్న పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్‌తో వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన విద్యాసంస్థల బంద్ జిల్లా కేంద్రంలో విజయవంతమైంది. ప్రయివేట్ విద్యాసంస్థల ముందస్తుగా సెలవు ప్రకటించగా, ప్రభుత్వ విద్యాసంస్థలను సంఘాల నాయకులు తరగతులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు సతీష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు బాలు నాయక్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిసెల కార్తీక్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం దినకర్, పీడీఎస్‌యూ జిల్లా నాయకులు జాడి విలాస్, శ్యామ్ రావు పాల్గొన్నారు.

**నస్పూర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం విద్యాసంస్థల బంద్ విజయవంతమైది. వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను బంద్ చేయించగా, ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు ముందస్తుగా బంద్ ప్రకటించాయి. ప్రభుత్వ విద్య సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చూస్తూ విద్యార్థులను బైకాడ్ చేయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల సన్నీగౌడ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు సిద్ధార్థ, సికిందర్, సుమంత్, అనిల్ పాల్గొన్నారు.

**కాగజ్‌నగర్ :** విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ బుధవారం చేపట్టిన విద్యాసంస్థల బంద్ కాగజ్‌నగర్‌లో విజయవంతమైంది. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తుమ్మిడె భీమేష్ ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని పాఠశాలలు బంద్ పాటించాయి. ఈ కార్యక్రమంలో నాయకులు వి సాయికుమార్, ఎ బండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

**కెరమెరి :** విద్యా రంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు జాఫర్ అన్నారు. విద్యా రంగ సమస్యల పరిష్కారించాలని రాష్ట్ర వ్యాప్తంగా వామపక్ష విద్యార్థి సంఘాల బంద్ పిలుపు మండలంలో విజయవంతమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమ, కిరణ్, రామచందర్, జి.నాందేవ్ పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్‌తో బాలలకు మంచి భవిష్యతు

నవతెలంగాణ-నస్పూర్

జిల్లా మహిళా, శిశు సంక్షేమశాఖ, పోలీసు శాఖ సంయుక్తగా నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా బాలలకు మంచి భవిష్యత్తు అందించవచ్చని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అన్నారు. బుధవారం జిల్లాలోని నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి కె.చిన్నయ్యతో కలిసి ఆపరేషన్ ముస్కాన్-9 కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం ద్వారా బడికి దూరమైన పిల్లలు, బడి మానివేసిన పిల్లలు, బాల కార్మికులను గుర్తించి విద్యాశాఖ ద్వారా వారిని పాఠశాలల్లో చేర్పిస్తున్నారని తెలిపారు. ప్రతి సంవత్సరం జూలై 1 నుండి 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 3 డివిజన్లలో కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, సంబంధిత అధికారులు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులకు, ఆపరేషన్ ముస్కాన్ టీం సభ్యులకు కార్యక్రమ నిర్వహణపై సూచనలు, సలహాలు చేశారు. అనంతరం కార్యక్రమ సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు ఎల్.సుందర్, అనిల్ కుమార్, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎస్.ఆనంద్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పి.రవీందర్‌రెడ్డి, జిల్లా విద్యాధికారి ఎస్.యాదయ్య, బి. వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

# ఎంజేపీ డిగ్రీ కళాశాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం మంజూరు చేసిన మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని బీసీ యువజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రానికి వచ్చిన ఆర్సిఓ గోపిచంద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెనుకబడిన జిల్లాకు డిగ్రీ కళాశాల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటివరకు మహిళల లేదా పురుషుల డిగ్రీ కళాశాల అనేది నిర్ణయించకపోయినప్పటికీ ఏ కళాశాలైన జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలన్నారు. పేరుకు ఆసిఫాబాద్ జిల్లా చేసినప్పటికీ అనేక విద్యాసంస్థలు స్థలం లేదనే సాకుతో కాగజ్‌నగర్ కేంద్రానికి తరలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కాగజ్‌నగర్ కేంద్రం ఇప్పటికి విద్యాపరంగా అభివృద్ధి చెందిందని అక్కడ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రంలో జనరల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తుందని తెలిపారు. నాయకులు కల్పించుకొని మహాత్మ జ్యోతిబాపూలే డిగ్రీ కళాశాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసేలా ఉన్నతాధికారుల ఒత్తిడి తీసుకురావాలని, లేదంటే తమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం నాయకులు ఆవిడపు ప్రణయ్, సైదం నాగరాజు, గడ్డల ప్రణయ్, గడ్డల సాయికరణ్, సాయికృష్ణ పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

- హాజరైన రామగుండం సీపీ రాజేశ్వరి, కలెక్టర్ సంతోష్



నవతెలంగాణ-హాజీపూర్

రాష్ట్ర స్థాయి అండర్-19 బాల బాలికల, మిక్సుడ్, డబుల్స్ ఛాంపియన్షిప్ పోటీలు బుధవారం మంచిర్యాలలోని రంగంపేటలోని మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం పోలీస్ కమిషనర్ రెమా రాజేశ్వరి, మంచిర్యాల కలెక్టర్ బాదావత్ సంతోష్, మంచిర్యాల డీసీపీ సుధీర్ రామ్నాథ్ హాజరు అయ్యారు. ఏసీపీలు తిరుపతిరెడ్డి, సదయ్య, బ్యాట్మెంటన్ అసోసియేషన్ చీఫ్ అడ్వైజర్ మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్ గౌడ్, విద్యాశాఖ అధికారి యాదయ్య, జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గ ప్రసాద్ హాజరై ప్రారంభ వేడుకలలో పాల్గొన్నారు. ముఖ్య అతిథులు, అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం కార్యక్రమం ఉద్దేశించి మాట్లాడారు. సీపీ మాట్లాడుతూ పిల్లలకు కచ్చితంగా ఫిజికల్ ఫిట్నెస్ ఉండాలని తల్లిదండ్రులు పాఠశాలలో యజమాన్యాలు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మంచిర్యాలలో రాష్ట్రస్థాయి పోటీ నిర్వహించడం శుభ పరిణామన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి ఎప్పుడు ముందుంటామని తెలిపారు. అతిథిలు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్తేజపరిచారు. ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులందరికి భోజనం వసతి సౌకర్యం కల్పించారు. 14వ తేదీ వరకు పోటీలు కొనసాగుతాయని తెలిపారు. బుధవారం మొదటి రౌండ్ పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ట్రస్మ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్, ఎస్ఎస్ఎస్ జిల్లా కన్వీనర్ చంద్రమోహన్‌గౌడ్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరు సుధాకర్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు భాస్కర్ల వాసు, బండ మీనారెడ్డి, జాయింట్ సెక్రటరీలు రమేష్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు పళ్లెం కృష్ణ, నరేందర్, అవిన్ బాబు పాల్గొన్నారు.

# విద్యుత్ సమస్యలు తీర్చడంలో అధికారులు విఫలం



నవతెలంగాణ-జన్నారం

- సర్వ సభ్య సమావేశంలో సభ్యుల ఆరోపణ

లోవోల్టేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న గ్రామ ప్రజల సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమైయ్యారని పలువురు మండల పరిషత్ సభ్యులు ఆరోపించారు. బుదవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మాదాడి సరోజన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో కామన్ పెల్లి, ఇందన్ పెల్లి ఎంపీటీసీలు జునుగురి మాధురి, శ్రీలతలు విద్యుత్ సమస్యలపై సమావేశంలో ప్రస్తావించారు. ఇందన్‌పెల్లి, కామన్‌పెల్లి గ్రామాల్లో చీటికి మాటికి కరెంట్ పోతోందని పోన్ చేస్తే విద్యుత్ అధికారులు స్పందించకుండా నిర్లక్ష్యధోరణి వ్యవహిరిస్తున్నారని వారు విమర్శించారు. ఈ విషయంపై సభ్యుల ఆరోణకు ట్రాన్స్‌కో ఏఈ లచ్చన్న సమాదనమిస్తూ విద్యుత్ సమస్యలు మేజర్‌గా ఉన్న గ్రామల్లో త్వరలోనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రిలో టీటీ ఇంజిక్షన్లు లేక రోగులు ప్రయివేట్ దవఖానలను ఆశ్రయిస్తున్నారని వైస్ ఎంపీపీ సుతారి వినయ్, పలువురు సర్పంచ్‌లు సమావేశంలో ఆవేదన వ్యక్తం చేశారు. సమాశంలో పాల్గొన్న ప్రభుత్వ వైద్యులు ఉషశ్రీ మాట్లాడుతూ టీటీ ఇంజిక్షన్ల కొరతపై జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని రెండు, మూడు రోజులు టీటీ ఇంజక్షన్లు హస్పిటల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ సమావేశానికి ముందు ఇటీవల ఎస్ఎస్‌సీ ఫలితాల్లో 10,10 శాతం జీపీఏ సాధించడంలో కృషి చేసిన కామన్‌పెల్లి, కలమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు దాముక కమలాకర్, జాడి ప్రభాకర్‌లను ఎంపీపీతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఘనంగా సన్మానించారు.

## దర్జాగా నాలా కబ్జా



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న నాలా కబ్జాకు గురైంది. ఈ నాలపై కొందరు ధర్జాగా వ్యాపార సముదయాలు నిర్మిస్తున్నారు. జాతీయ రహదారి 63 పక్కనే నాలాపై నిర్మాణాలు చేపడుతున్న అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా సింగపూర్ పాత గ్రామపంచాయతీ కార్యాలయం ప్రహరీ గోడకు అనుకోని నిర్మాణాలు చేపడుతున్న అధికారులు అటు వైపు కన్నెత్తి చుడకపోవడంతో పలు ఆరోపణలు వెల్లవేతుతున్నాయి. దీనిపై మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

## ఆశ్రమ పాఠశాల పరిశీలన

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని ఆశ్రమ పాఠశాలను ఆసిఫాబాద్ ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ మనెమ్మ బుధవారం సందర్శించారు. బుధవారం ఆమె మండలంలోని సోమిని, బెజ్జూర్, సలుగుపెల్లి, కుంటలమానెపెల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆశ్రమ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు. అనంతరం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్కులు పంపిణీ చేశారు. ఆమె వెంట కాగజ్‌నగర్ ఏటీడీఓ కమర్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు పార్థిరాం ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని కొండపెల్లి గ్రామానికి చెందిన వార్డుసభ్యుడు కుశనబోయిన వెంకన్న మంగళవారం సాయంత్రం విద్యుత్ షాక్‌తో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, జడ్పీ వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు పరామర్శించి అన్ని విధాలుగా ఆదుకుంటామని రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కొండపెల్లి సర్పంచ్ సంజీవ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తిరుపతి, చింతలమానేపెల్లి ఎంపీపీ డుబ్బుల నానయ్య, డుబ్బుల వెంకన్న, అగర్‌గూడ సర్పంచ్ సుధాకర్ పాల్గొన్నారు.

## ఐటీఐ రెండో దఫా అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

నవ తెలంగాణ-మందమర్రి

ప్రభుత్వ ప్రయివేట్ ఐటీఐ అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 2023 సెషన్ కొరకు ఎన్సివిటి ప్యాటాన్ కింద వివిధ ఇంజనీరింగ్‌నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్స్‌లలో శిక్షణను పొందటానికి రాష్ట్రంలోని గవర్నమెంట్, ప్రైవేట్ ఐటీఐ కళాశాలలో మొదటి దఫాలో మిగిలిన సీట్లకు రెండవ దఫా అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మందమర్రి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ దేవానంద్. దరఖాస్తు కొరకు 12-07-2023 నుండి 31-07-2023 చివరి తేదీ అని కావున అభ్యర్థులు ఇట్టి అవకాశమును వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ దేవానంద్ తెలిపారు.

## సింగరేణి కళాకారుల ఏరియా కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కళాకారుల ఐక్యవేదిక శ్రీరాంపూర్ ఏరియా నూతన కమిటీని బుధవారం నస్పూర్ సేవా భవన్‌లో సింగరేణి కళాకారుల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు పులియాల సతీష్ ఆధ్వర్యంలో ఆ సంఘం శ్రీరాంపూర్ ఏరియా కమిటీ నియమించారు. గౌరవ అధ్యక్షుడిగా గజ్జెల్లి రాయలింగు, గౌరవ సలహాదారులుగా వై.సత్యనారాయణ, అధ్యక్షుడిగా ఎస్కే తాజుద్దీన్, ఉపాధ్యక్షులుగా పెద్దయ్య, రవీంద్ర కుమార్, చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా కొరిమి సదానందం, సహాయ కార్యదర్శిగా సతీష్, కోశాధికారిగా నర్సయ్య, సంయుక్త కార్యదర్శిలుగా కిరణ్, సందేశ్, ప్రచార కార్యదర్శిగా వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా బి మల్లేష్, ఐ.రాములు, అబ్దుల్లా, వంశీ, హరీష్, జంపయ్య, అంజయ్య,సాగర్, సురేందర్, శ్రీకాంత్, జి.సుధాకర్లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు తాజుద్దీన్ మాట్లాడుతూ కళాకారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడానికి ఎల్లవేళలా కృషి చేస్తానని తెలిపారు.

## కాంగ్రెస్ నాయకుల సత్యాగ్రహ దీక్ష



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం దగ్గర సత్యాగ్రహ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ అనార్హత వేటుపై గుజరాత్ కోర్టు బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో దేశవ్యాప్తంగా ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. రాహుల్ గాంధీ బెల్ పిటీషన్ గుజరాత్ కోర్టు తిరస్కరించడం దారుణమని అన్నారు. రాజకీయంగా రాహుల్ గాంధీని ఎదుర్కోలేకే బీజేపీ ప్రభుత్వం కుటిల రాజకీయాలకు తెరలేపిందన్నారు. బీజేపీ ప్రభుత్వాన్ని గంగలో కలిపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీని ప్రజలు చేరదీసి అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇసాక్, నందు నాయక్, ఎండీ అజార్, తాటికొండ శీను, గొర్రె మహేష్, మంద రాజేష్, రాజేశ్వర్, రాజ్ కుమార్, రియాసత్ అలీ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
# నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
గురువారం 13 జులై 2023



## రైతుబీమాకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని రెబ్బెన గ్రామ పంచాయతీ కార్యాలయంలో కొత్తగా పట్టా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు, పోడు పట్టాదారులు కూడా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రవితేజ కోరారు. ఇప్పటివరకు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోని రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పట్టాదారు రైతు మరణిస్తే రైతుబీమా ద్వారా నామినీకి రూ.5 లక్షలు వస్తాయని తెలిపారు. దరఖాస్తు చేసుకోని రైతులు ఆగస్ట్ 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## రూ.6లక్షల ఇన్సూరెన్స్‌చెక్కు అందజేత

నవతెలంగాణ-రెబ్బెన



రెబ్బెన యూనియన్ బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్టు బ్యాంక్ మేనేజర్ సత్యనారాయణ తెలిపారు. మండలానికి చెందిన అడె శంకర్ గత సంవత్సరంలో అనారోగ్యంతో మరణించాడు. ఆయన స్టార్ యూనియన్ డైఇచ్ లైఫ్ ఇన్సూరెన్స్ బీమా కంపెనీలో సభ్యులు కావడంతో నామినీ అయిన ఆయన భార్య అడె బోయబాయికి రూ.6 లక్షల చెక్కును బ్యాంకు మేనేజర్, ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్ ఫీల్డ్ ఆఫీసర్ ఆమెకు అందజేశారు.

# జీపీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమను రెగ్యులర్ కార్మికుల వలె గుర్తించాలని మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌తో నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులు బుధవారం కలెక్టరేట్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఆరు రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నప్పటికీ ప్రభుత్వం తమను గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఆరోగ్యాలను పణంగా పెట్టి పని చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్, నాయకులు రాజు, సమ్మయ్య, శంకర్, మహేష్, సాబీర్, కైలాస్, పద్మ, విజయ, పెంటుబాయ్ పాల్గొన్నారు.




**దహెగాం :** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మొరేశ్వర్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలో 7వ రోజు కొనసాగుతున్న సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అనంతరం మండలకేంద్రంలో కొందరు ప్రయివేటు వ్యక్తులతో పారిశుధ్య పనులు చేపడుతున్నట్టు తెలిసి వారిని అడ్డుకున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం తాము సమ్మె చేస్తున్నామని, దీనికి అందరు సహకరించాలని కోరారు. సమ్మె శిబిరాన్ని బీజేపీ నాయకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు సందర్శించి మద్దతు ప్రకటించారు. అలాగే మండల కాంగ్రెస్ నాయకులు సైతం మద్దతు తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు రమేష్, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి రాజ్‌కుమార్, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్‌తో పాటు ఆయా గ్రామాల పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

**కెరమెరి :** జీపీ కార్మికుల సమ్మె బుధవారంతో 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా జీపీ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా రోజు వారీ కూలీలచే పారిశుధ్య పనులు చేయించడం సరైంది కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు సమ్మె విరమించేది లేదని తెలిపారు.

**భీమారం :** బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ. నెం. 51ని తీసుకొచ్చి పంచాయితీ కార్మికుల కడుపుకొడుతోందని నియోజకవర్గ కాంగ్రెస్ నాయకురాలు రామిళ్ళ రాధిక ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న గ్రామ పంచాయితీ ఉద్యోగ కార్మికులను పర్మనెంట్ చేయాలని, ఆలోపు జీఓ నెం.60 ప్రకారం రూ.19వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట సమ్మె చేపట్టిన గ్రామ పంచాయితీ కార్మికులకు బుధవారం ఆమె సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలి చాలని వేతనాలతో ఇంతకాలం పని చేసుకుంటు వస్తూ తమ న్యాయమైన కోరికలను పరిష్కరించాలని కోరుతున్న వారిని నిర్లక్ష్యం చేసి బెదిరింపులకు గురి చేయడం తగదన్నారు. సకల జనుల ఉద్యమంతో పీఠం దక్కించుకున్న కేసీఆర్ కుటుంబ పాలనతో లబ్ధిపొందిందని, నేడు అదే ఉద్యమ స్ఫూర్తితో కనీస హక్కులను సాధించుకోవాలనుకోవడం తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో నాయకులు కోట రవి, అడకట్ల తిరుపతి, రవి, పంచాయితీ ఉద్యోగ కార్మికులు కృష్ణమూర్తి, భరత్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**కాసిపేట :** కాసిపేట మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారం కొనసాగుతుంది. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు సమ్మె విరమించేది లేదని పంచాయతీ కార్మికులు తేల్చి చెప్పారు. చాలీచాలని జీతాలతో ఇబ్బంది పడుతున్నామని, ఎటువంటి సౌకర్యాలు లేవని మా సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు రోజు వారి నిరసన కార్యక్రమాలను చేపడుతామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి కార్మికుల సంఘం నాయకులు దాసరి రాజయ్య, శ్యామ్, కటుక దీపక్, అట్ల మల్లేష్, వెంకటేష్, కరీం, విజయ్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

**చింతలమానేపల్లి :** మండల కేంద్రంలో గ్రామపంచాయతీ కార్మికుల సమ్మె బుధవారం ఏడు రోజు కొనసాగింది. గ్రామ పంచాయతీ సిబ్బంది అర్ధ నగ్న ప్రదర్శనతో ఎంపీడీవో కార్యాలయం ఎదుట సమ్మెలో పాల్గొన్నారు.

**రెబ్బెన :** మండలకేంద్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తున్న నిరవదిక సమ్మె 7వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీ కార్మికులు అర్ధనగ్న నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సమ్మె నివారణకు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దుర్గం దేవాజీ, జుమ్మి సంతోష్, వెంకటేశ్, రమేష్, శ్రీనివాస్, లక్ష్మి, మహేందర్ పాల్గొన్నారు.

## బస్సు సౌకర్యం కల్పించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి జనరల్ మేనేజర్ కార్యాలయం నుంచి నేషనల్ హైవే, గోలేటి క్రాస్ రోడ్డు వరకు గోలేటి జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి బస్సు సౌకర్యం కల్పించాలని టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు కోరారు. బుధవారం డైరెక్టర్ (ప్రాజెక్టు అండ్ ప్లానింగ్) వెంకటేశ్వర్‌రెడ్డికి జీఎం కార్యాలయం ఫిట్ కార్యదర్శి గడ్డం రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన గోలేటికి ఆర్‌టీసీ ఆధ్వర్యంలో బస్సు సౌకర్యం ఉండేదని, ఇప్పుడు బందు కావడం జరిగిందని, మహిళా ఉద్యోగులు ఎక్కువ మంది ఉండడం వల్ల ప్రతిరోజు గోలేటి క్రాస్ రోడ్డు వద్దకు వెళ్లడంతో ఇబ్బందులకు గురవుతున్నారని డైరెక్టర్ దృష్టికి తీసికొచ్చారు. ప్రతిరోజు గోలేటి జీఎం కార్యాలయం నుండి నేషనల్ హైవే వరకు జీఎం కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉచిత రవానా సౌకర్యం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ డి.దేవేందర్, ఎస్ఓటు జీఎం మచ్చగిరి నరేందర్, టీబీకేఎస్ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి మంకయ్య పాల్గొన్నారు.

## సమస్య పరిష్కరించాలంటూ ఎండిఎం కార్మికుల నిరసన



నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ సమస్యలు పరిష్కరించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కనీస వేతనాలు ఇవ్వాలని మెనూ చార్జీలు పెంచాలని డిమాండ్‌తో మూడు రోజుల టోకెన్ సమ్మె ముగింపు కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో 2022 సంవత్సరంలో మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు పెంచుతున్నట్లు ప్రకటించారని ఇప్పటివరకు పెంచిన వేతనాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అల్లూరి లోకేష్, ముంజం శ్రీనివాస్, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాయ, శారద, జిల్లా నాయకులు మడావి చంద్రకళ, కాంతమ్మ, రూప, పార్వతి, రజిత, లలిత, గిరిబాబు, సీఐటీయూ నాయకులు రాజేందర్, ఓదేలు, ఆనంద్ కుమార్, కృష్ణమాచారి, నగేష్ పాల్గొన్నారు.

**నస్పూర్ :** మధ్యాహ్న భోజన కార్మికులకు పెరిగిన వేతనాలు చెల్లించాలని, అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. తెలంగాణ మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేసి అనంతరం కార్యాలయలో అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పదేపదే రాష్ట్ర ప్రభుత్వానికి చెపుతున్న ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దూలం శ్రీనివాస్, సీఐటీయు జిల్లా నాయకులు బుచ్చన్న, కాంతమ్మ, పద్మ, అంజలి, అరుణ, లక్ష్మి, గట్టమ్మా, పోసాక్క, భాగ్య రఫియా, అనసూయ పాల్గొన్నారు.

## పార్టీ మార్చే ప్రసక్తే లేదు : హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

తాను పార్టీ మారుతున్నట్లు కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు స్పష్టం చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాను బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ప్రచారం చేస్తున్నారని, ఇందులో ఏ మాత్రం వాస్తవం లేదని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే కోనప్ప, వారి అనుచరులే ఈ దుష్ప్రచారం చేస్తున్నారని, తన పార్టీ కార్యకర్తలు, అభిమానులలో అయోమయం సృష్టించి లబ్ధి పొందేందుకు వారు ప్రయత్నిస్తున్నారని అన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో తాను బీజేపీ నుండే పోటీ చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అనంతరం దహెగాం మండలం ఖర్జి గ్రామానికి చెందిన తుమ్మిడె రాజశేఖర్ ఇటీవల మృతి చెందగా అతని కుటుంబాన్ని బుధవారం హరీష్‌బాబు పరామర్శించారు. అతని వెంట మండల అధ్యక్షులు రాపర్తి ధనుంజయ్, సర్పంచ్‌లు ఎల్కరి సంజీవ్, దామోదర్, నాయకులు ప్రభాకర్‌గౌడ్, తిరుపతిగౌడ్, దందెర శంకర్, తుమ్మిడె బక్కన్న, రాపర్తి ప్రదీప్, చౌదరి ఇస్తారి, జునుగరి కృష్ణ, లక్ష్మణ్, కొటారి బాపు, జంపేష్, చిరంజీవి పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీ రైల్వే ట్రాక్ మెయిన్‌టెన్స్ కాంట్రాక్టు కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. బుధవారం పెండింగ్‌లో ఉన్న వేతనాలతో పాటు ఏరియర్స్ చెల్లించాలని కోరుతూ గోలేటీ సీహెచ్‌పీ రైల్వేట్రాక్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బోగె ఉపేందర్ మాట్లాడుతూ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే కార్మికులకు ప్రతినెల 10వ తేదీలోపు రావాల్సిన వేతనాలు రావడంలేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం వేతనాలు చెల్లించి కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు పెరుగు చంద్రయ్య, చల్లూరి రాజన్న, శోభన్, వెంకటేశ్, మహేందర్, పోచయ్య, వినోద్, మారుతి, దేవాజీ పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిని నియమించాలి

నవతెలంగాణ-కెరమెరి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యున్ని నియమించాలని ఎంపీపీ పెదూర్ మోతీరాం, జడ్పీటీసీ సెడ్మకి ద్రుపత బాయి ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్‌ను కోరారు. బుధవారం ఆసిఫాబాద్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఆసుపత్రిలో ఇదివరకు పని చేసిన వైద్యుడు బదిలీపై వెళ్ళడంతో పేద ప్రజలకు వైద్యం అందించేందుకు వైద్యులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. మారుమూల గ్రామాల గిరిజన ప్రజలు వైద్యం కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిపై ఆధారపడి ఉన్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వెంటనే ఆసుపత్రిలో వైద్యులను నియమించాలని కలెక్టర్‌కు విన్నవించారు. వినతిపత్రం అందించిన వారిలో సాంగ్వి సర్పంచ్ తొడసం జగన్నాథ్ రావు ఉన్నారు.

## విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం

నవతెలంగాణ-కౌటాల

విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ ప్రాంగణంలో నిర్వహించారు. సమస్యల పరిష్కారానికి కౌటాల, బెజ్జూర్, చింతలమానెపెల్లి, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్ మండలాల నుండి విద్యుత్ సమస్యలున్నా విద్యుత్ వినియోగదారులు పరిష్కార వేదికలో పాల్గొని విద్యుత్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో 59 సమస్యలపై ఫిర్యాదులు రాగా అందులో 40 ఫిర్యాదులను అప్పటికప్పుడు పరిష్కరించి 19 ఫిర్యాదులను 20 రోజుల్లోపు పరిష్కరించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల ఫోరాం చైర్మన్ ఈశ్వరయ్య, అధికారులు అశోక్, కిశన్, భూమారెడ్డి, ఏఈ రవీందర్ పాల్గొన్నారు.

## స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్ల రుణాలు పంపిణీ

నవతెలంగాణ-జైపూర్

మండల పరిధి కుందారం గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన స్వయం సహాయక మహిళా సంఘాలకు బుధవారం రూ.3 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. కుందారం బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమం ద్వార తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రీజినల్ మేనేజర్ మురళీ, బ్యాంక్ మేనేజర్ సంతోష్ శ్రీవాస్తవ్ చేతుల మీదుగా వివిధ గ్రామాలకు చెందిన 47 సంఘాలకు చెందిన రుణ సహాయం పొందారు. అదే విధంగా బ్యాంకు పరిధిలో గల వివిధ గ్రామాలకు చెందిన వారికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి భీమా ద్వార లబ్ధిదారులకు రూ.2 లక్షల చొప్పున ముగ్గురికి చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్, ఏపీడీ శ్రీనివాస్, డీపీఎం స్వర్ణలత ఉన్నారు.

## ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆర్టీసీ సంస్థలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి భోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ రాజేశంకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీలో ట్రేడ్ యూనియన్లను రద్దుచేసి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయడం జరిగిందని వెల్ఫేర్ బోర్డులు కేవలం పైరవీలకు మాత్రమే పరిమితం అయ్యాయని అన్నారు. నిబంధనల ప్రకారం ట్రేడ్ యూనియన్లను ఆహ్వానించి ఎన్నికల వెంటనే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో సెక్రటరీ టి.దివాకర్, జేఏసీ నాయకులు బాలునాయక్, ఆనంద్, ఉల్లాస్ పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఆధ్వర్యంలో సబ్‌స్టేషన్ ఎదుట నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యుత్ సంస్థలను 60 వేల కోట్ల బకాయల్లోకి నెట్టారంటూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్‌ల ఎదుట చేపట్టిన నిరసనలో భాగంగా జిల్లా కేంద్రంలోని సబ్ స్టేషన్ ఎదురుగా పార్టీ నాయకులు ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని అబద్ధాలు చెబుతూ విద్యుత్ సంస్థలను ప్రభుత్వం నిండముంచిందన్నారు. తమ ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నిరంతర విద్యుత్‌తో పాటు విద్యుత్ సంస్థలను అప్పుల్లో నుంచి గట్టెక్కించే విధంగా అవసరమైన బడ్జెట్ కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శ్రీమతి మార్సుకోల సరస్వతి, యూత్ జిల్లా అధ్యక్షులు గుండా శ్యామ్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు ఎండి ఆసిఫ్, మండల అధ్యక్షులు మసాడే చరణ్, టౌన్ ప్రెసిడెంట్ రాపర్తి మురళి, సీనియర్ నాయకులు ఎల్లప్ప, దీపక్, జమీర్, అర్షస్, కాస్లీన్, విశ్వనాథ్, శ్రీనివాస్, బాలు, గంగారాం, ప్రభాకర్, సాయి పాల్గొన్నారు.


దహెగాంలో..

**దహెగాం :** కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఉచిత కరెంటు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దేనని, దానిని బీఆర్ఎస్ నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌కు వస్తున్న ఆధరణను ఓర్వలేకనే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎలుక మోహన్, తోగేష్, వెంకటేశ్, రవి పాల్గొన్నారు.


**జన్నారం :** మెదటగా రాష్ట్రంలో రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్ఎస్ నాయకులు నాయకులకు తెలిసి కూడా టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేసిన వాఖ్యలను వక్రీకరించి రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుర్రం మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం పని చేసే పార్టీ కాంగ్రెస్ అని, ఏక కాలంలో రుణమాఫీతో పాటు సబ్సిడీపై పనిముట్లు అందించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం రాజన్న, బోర్లకుంట ప్రభుదాస్, మండల ప్రధాన కార్యదర్శి ఫసీ ఉల్లా, ఎంపీటీసీ దాముక కరుణాకర్ పాల్గొన్నారు.

**రెబ్బెన:** మండలకేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం కాంగ్రెస్ శ్రేణులు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యుత్ సమస్యలకు రూ.60 వేల కోట్ల అప్పుల్లో ముంచడంతో ఆ మోసాలకు నిరసనగా బుధవారం మండలకేంద్రంలోని సబ్‌స్టేషన్ ఎదుట ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో రాచరిక ప్రభుత్వానికి వ్యతిరేకంగా మండలంలోని కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ 24 గంటల విద్యుత్ ఇస్తామని చెప్పి రైతులకు కేవలం 10 గంటలు కరెంటు ఇస్తున్నారని, అదేవిధంగా డబుల్‌బెడ్‌రూంల జాడేలేకపోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్ రమేష్, మాజీ జడ్పీటీసీ దుర్గం సోమయ్య, ఎస్‌సీసెల్ జిల్లా అధ్యక్షుడు పోచం, పూదరి హరీష్, భీంరావు, సునార్కర్ తిరుపతి, బి కార్తీక్, నీలయ్య, రత్నం ఆనంద్‌రావు, ఇగురపు రవి, గణపతి పాల్గొన్నారు.

**కోటపల్లి :** చెన్నూర్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ వద్ద సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పీసీసీ సభ్యుడు నూకల రమేష్ ,కాంగ్రెస్ నాయకులు బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రైతులకు ఉచిత విద్యుత్ విషయంలో మాట్లాడిన మాటలను కేటీఆర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వక్రీకరిస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్ సూరజ్ డీసీసీ మెంబర్ పుల్లూరి లక్ష్మన్, ఖలీల్, కాంగ్రెస్ జిల్లా నాయకులు జూల లక్ష్మణ్, చెన్నూర్ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఈర్ల నారాయణ, పోగుల పురుషోత్తం, చెడె అశోక్, సుధాకర్‌రెడ్డి, పేంటు, ఇర్షాద్, గజ్జెల అంకగౌడ్, జనగామ శ్రీనివాస్, కోటపల్లి మండల అధ్యక్షులు మహేష్ ప్రసాద్ తివారి పాల్గొన్నారు

**జైపూర్ :** రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు బురుదజల్లే ప్రత్నం చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రిక్కుల శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆయన మాటలను వక్రీకరిస్తూ రేవంత్ దిష్టి బొమ్మలను దహనం చేసిన తీరును వ్యతిరేకిస్తూ బుధవారం మండల కేంద్రంలో సీఎం కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల డాక్టర్ రాజా రమేశ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహమ్మద్ ఫయాజోద్దీన్ పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


మేమనపల్లిలో..

నవతెలంగాణ-వేమనపల్లి

మండల కేంద్రంలో బుధవారం టీపీసీసీ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి రైతు వ్యతిరేక వ్యాఖ్యలను ఖండిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వేమనపల్లి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కోళి వేణుమాధవ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తన మాటలు వెనక్కి తీసుకొని రైతులకి క్షమాపణ చెప్పకుంటే కాంగ్రెస్ మీద రైతులు తిరగబడతారని అన్నారు. కాంగ్రెష్ పార్టీకీ తెలంగాణాలో పుట్ట గతులు లేకుండా చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కుబిడే వెంకటేష్, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు తలండి భీమయ్య, వైస్ ఎంపీపీ ఆత్రం గణపతి, ఎంపీటీసి దాగం బాపు, మాజీ సర్పంచులు నాయిని లక్ష్మణ్, బోర్కుటి సంతోష్ పాల్గొన్నారు.

**కాసిపేట :** మండలంలోని కొండాపూర్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీ కి రైతులపై ప్రేమలేదని పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తె 3గంటల కరెంట్ ఇస్తారని విమర్శించారు. ధరణి తీస్తారు, రైతు బంధు తీసేస్తారు రైతులకు సకాలంలో మందులు ఎరువులు రాకుండా మళ్ళీ వెనుకటి కాంగ్రెస్ పాలనను తీసుకవస్తారు అని అన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పల్లె చెంద్రయ్య, ఎంపీపీ రొడ్డ లక్ష్మి, వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రంరావు, బీఆర్ఎస్ మండల్ ప్రెసిడెంట్ బొల్లు రమణారెడ్డి, ఎంపీటీసీలు చెంద్రమౌళి, అక్కేపెల్లి లక్ష్మి, కొండబత్తుల రాంచేందర్ పాల్గొన్నారు.

**జన్నారం :** తెలంగాణ రైతులకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని మండల వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్ బిఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు మున్వార్ అలీ ఖాన్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, జిల్లా అధికార ప్రతినిధి భరత్ కుమార్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజేష్ యాదవ్ పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్ :** కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక పార్టీ అని మరోసారి నిరూపితమైందని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు నిరసిస్తూ ఆయన దిష్టిబొమ్మను జిల్లా కేంద్రంలోని సబ్ జైలు ఎదుట దహనం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, మాజీ ఎంపీపీ బాలేశ్ గౌడ్, నాయకులు తారిక్, శైలెందర్, జాలింషా, కార్తీక్, నిసార్, సలాం, ఇజాజ్, ఇమ్రాన్, బండిసాయి పాల్గొన్నారు.


జన్నారంలో..


కౌటాలలో..

**రెబ్బెన :** మండలకేంద్రంలోని బస్టాండు వద్ద బుధవారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టి బొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు ఇస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్ పథకాలపై వ్యతిరేకంగా మాట్లాడిన రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ జుమ్మి సౌందర్య ఆనంద్, సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, కుందారపు శంకరమ్మ, బొమ్మినేని శ్రీధర్, అజయ్ జైస్వాల్, కార్నాదం సంజీవ్ పాల్గొన్నారు.

**కౌటాల :** కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు 24 గంటల కరెంటు అవసరమా అని రైతులను కించపరిచిన రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు, రైతులు కలిసి మండలకేంద్రంలోని కొమురంభీం చౌరస్తా వద్ద దగ్ధం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆదె వసంత్‌రావు, దుబ్బుల వెంకయ్య, తాళ్లపెల్లి రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.